చిలిపితనం

అంతవరకూ టైపుచేసి అలసిపోయిన వ్రేళ్ళు విరుచుకుని యెడమ చేత్తో ముఖం మీదకి జారుతున్న ముంగురులను సవరించుకుంది. తర్వాత ఆవులించి కుర్చీలో వెనక్కుజారి సుఖంగా సర్దుకు కూర్చున్నది మిస్ భారతి.... బి.ఎ. ఆమెకు కుడివైపు పెద్ద గదిలో ఉన్నాడు ఆఫీసరు. ఇటీవలే ఇక్కడకు ట్రాన్స్‌ఫర్ మీద వచ్చాడు. నలభై ఏళ్ళు కూడా వుండవు. పొడవుగా, పచ్చగా, అందంగా ఉంటాడు. పలుచని ఫ్రేమున్న కళ్ళద్దాలు కూడా అతని ముఖానికి అందాన్నే ఇచ్చాయి. మాటిమాటికీ మీసాలమీద ఎడమచేతి చూపుడు వ్రేలు త్రిప్పుతూ వుంటాడు, ఆ మీసం అక్కడ వుందోలేదో అని అనుమానం వచ్చినవాడిలా. మనిషికి గర్వం వగైరా గుణాల్లేవు గాని స్ట్రిక్ట్. పేరు పవిత్రన్.... ఇవ్వాళ సెంట్రల్ ఆఫీసు నుంచి ఫోన్‌కాల్ రావాలని ఆరు గంటలు దాటుతున్నా వెయిట్ చేస్తున్నాడు. లోపల ఏం చేస్తున్నాడో తెలీదు. బహుశా ఎప్పుడూ చేతిలో వుండే ఆ దిండు లాంటి పుస్తకం నవులుతున్నాడేమో!

స్ప్రింగ్ డోరు తెరుచుకున్న సవ్వడి వినిపించి గుమ్మం వైపుకు చూసింది భారతి. ప్యూను.... కంఠస్వరం తగ్గించి 'నన్ను వెళ్ళమంటారా అమ్మా' అని అడిగాడు.

భారతి ఆవులిస్తూ చెయ్యి గాలిలోవూపి వెళ్ళమన్నట్టు సైగచేసింది. తర్వాత లోలోపల 'నాకెలాగూ తప్పదు శవజాగరణ.... నీకెందుకు కష్టం ఫో.... ఫో.... ఏదైనా రంగుల సినిమాకు పోయి కూర్చో..." అనుకున్నది.

ఆమెకు అంతలో తండ్రి గుర్తుకు వచ్చాడు. ఇప్పుడేం చేస్తున్నాడో? ఉదయం తాను ఆయనతో చాలా కటువుగా ప్రవర్తించింది. ఒక కూతురు తండ్రిని అనగూడని మాటలెన్నో అన్నది. చాలా నిర్దయగా సాయంకాలం తాను వచ్చేవరకూ బల్ల ఎక్కి నిలబడమని కసరింది. ఆయన కళ్ళనీళ్ళు పెట్టుకుని బల్ల ఎక్కి నిలబడితే మారు మాటాడకుండా వచ్చేసింది. ఆయన గురించి తెలిసి బజారుకు పంపడం తన తప్పు. మతిస్థిమితం లేని మనుషులకు పనులు చెప్పకూడదు. అసలు జరిగిందేమిటంటే ఉదయం ఆఫీసుకు వెళ్ళే హడావిడిలో వుంది తాను. ఆయన ముందుగదిలో కూర్చుని అనవసరంగా కాగితాలు ముక్కలు ముక్కలుగా చించిపోస్తున్నాడు. తర్వాత పెన్సిలు వెదికి పుచ్చుకుని ఒక్కొక్క కాగితంముక్క మీద ఒక్కొక్క అంకెవేస్తూ కూర్చున్నాడు. ఆయనకు పిచ్చి అంటారందరూ.... కాని అదేమీ ప్రమాదకరమైన పిచ్చికాదు. కాస్త చిత్తచాంచల్యం.... అది చాలా ఏళ్ళుగా వుంది. ఎవరికీ ఏ ఇబ్బందీ కలిగించడు. తన ప్రపంచంలో తానుంటాడు. ఎప్పుడూ ఏదో గొణుక్కుంటూ ఉంటాడు. ఉదయం వంట హడావిడిలో తాను ఆయనకు అయిదు రూపాయల నోటు ఇచ్చి వీధి చివర కొట్లో కూర, ఏదైనా సరే, ఒక పావుకిలో పట్టుకురమ్మంది. ఆయన తనకూతురు పని చెప్పిందనే హుషారులో లేచి ఏదైనాసరేనా.... "బంగాళా దుంపలయినా.... వంకాయలయినా....?' అని అడిగాడు నోటు అందుకుని.

"ఏదైనాసరే.... త్వరగా.... పట్టుకురా' అన్నది ఆమె. ఆయన అయిదు నిముషాల్లో తిరిగివచ్చాడు. చేతిలో నిలువెత్తు పొడవున్న సేఫ్టీపిన్నుల దండలతో.... వచ్చి నివ్వెరపోయి నిలుచున్న కూతురితో 'వీధిలో ఇవి అమ్ముతున్నాడొకడు. మొత్తం ఎంతకిస్తావని అడిగితే ఆరు రూపాయలవుతాయన్నాడు.... అయిదే ఇస్తానన్నాను. సరే అని ఇచ్చాడు. మొత్తం అయిదొందలుంటాయి. చీప్ కదూ....' అన్నాడు. ఇంకా ఆయన ధోరణి అలా కొనసాగేదే.... కాని ఆమె గయ్యిమని లేచింది. అరిచింది.... తిట్టింది. చివరకు 'నువ్వింకా బ్రతికుండి నా ప్రాణాలు తీస్తున్నావు' అని కూడా అన్నది.

అవును - తాను ఆ మాటకూడా అన్నది. చివరకు తాను వచ్చే వరకూ బల్లమీద నుంచోమన్నది. ఆయన గడగడలాడుతూ బల్ల ఎక్కి తప్పు చేసిన పిల్లవాడిలా తలవంచుకు నిలబడ్డాడు. తాను ఆఫీసుకు వచ్చేసింది. మధ్యాహ్నం లంచ్ టైములో తానేదో తిన్నది. పాపం ఆయన - ఏం చేస్తున్నాడో- ఇంకా అలాగే బల్లమీద నిలబడి ఉన్నాడేమో! ఈ ఊహ రాగానే ఆమె గుండెలు జలదరించాయి.

నిజానికి ఈ లోకంలో పిచ్చివాళ్ళు కానిదెవరు? ఇంకా ఇతరులతో పోలిస్తే తన తండ్రి చాలా నయం. ఎక్కువ మందికి డబ్బుపిచ్చి - కొంత మందికి మదపిచ్చి - కొంతమందికి అధికార పిచ్చి.

మళ్ళీ స్ప్రింగ్ డోరు కొద్దిగా కదిలింది. పూర్తిగా తెరుచుకోలేదు. కాని దాని కిందనుంచి దూరి లోపలకి వచ్చిందొక శాల్తీ - ఆరేళ్ళుంటాయేమో.

భారతి కళ్లు పెద్దవి చేసుకుని చూసింది.

రబ్బరు బొమ్మలాటి అందమైన ఆడపిల్ల - కనకాంబరం రంగు ఫ్రాక్ వేసుకుని ఉంది. చెవులకు రింగులు, కాళ్ళకు సాండల్స్- గోళ్ళకు రంగు - లోపలకి వస్తూనే ఎదురుగా వున్న భారతివైపు చూసింది చక్రల్లాటి కళ్ళతో.

"ఎవరమ్మాయీ నువ్వు? ఏం కావాలి?" అని అడిగింది భారతి.

"ఏమీలేదు. బయట వర్షం- పెద్ద వర్షం -"

భారతి ఆశ్చర్యపోయింది. తన ఆలోచనల్లో తానుండి వర్షంపడటం కూడా గమనించలేదు. అయినా అంత భవంతిలో లోపల ఈ ఆఫీసులో ఎలా తెలుస్తుంది?

"మరి- కింద ఎక్కడో నిలబడక ఇంత లోపలికి వచ్చావేం?"

"ఊరికినే-" అన్నదా పిల్ల.

"సరే ఇలా వచ్చి కూర్చో-"

నెమ్మదిగా నడిచివచ్చి భారతి ఎదురుగా కూర్చీలో ఎగిరి కూర్చుంది.

భారతికి ఆ వాలకం నవ్వు తెప్పించింది.

"నీ పేరు?"

"అరవింద.... అరవిందమణి...."

"ఏం చదువుతున్నావు?"

రెండు వేళ్ళు చూపించింది.

భారతికి చిరాకనిపించింది, బాస్ గదివైపు చూసింది. ఆ ఫోన్ ఎప్పుడు వస్తుందో.... తనకు విడుదల ఎప్పుడో?

ఈ ఆఫీసరుకు ముందు నెలరోజుల క్రిందటి వరకూ మరొక ముసలాయన ఉండేవాడు. మెతక మనిషి. ఎవరు ఏఅబద్ధం చెప్పినా తేలిగ్గా నమ్మేసేవాడు. ఇప్పుడు రిటైరైపోయాడు.

ఒక రోజు.... ఆ ఆఫీసులో కొత్తగా అప్పాయింట్ అయి వచ్చిన యువకుడు నేరుగా ఆమె దగ్గరికే వచ్చి తాను వచ్చిన పని చెప్పాడు. 'ఆఫీసరుగారిని కలవండి... ఇటు...' అని చెప్పి భారతి సరదాగా అన్నట్టు "ఒక విషయం వినిపోండి.... మీరు కొత్తకదా.... లోపల ఆయనతో కాస్త - కాస్త ఏం... బాగానే బిగ్గరగా మాట్లాడండి. ఎందుకంటే ఆయనకు ఘోరమైన చెవుడు..." అన్నది.

అతడు నవ్వి "అలాగా, మంచిదయింది మీరు చెప్పడం. లేకపోతే చిక్కుల్లో పడేవాణ్ణి." అని లోపలికి వెళ్ళాడు.

లోపల అతను పెద్దగా అరిచినట్లు మాట్లాడటం... ఆఫీసరుగారు నెమ్మదిగా 'ఎందుకలా పెద్దగా మాట్లాడతారు...? బిసాఫ్ట్....' అని పదే పదే అనడం ఒక ప్రహసనంలా ఆనందించారందరూ... అయిదునిముషాల తర్వాత ఆ యువకుడు బయటకు వచ్చి భారతి వంక భయంకరంగా క్రూరంగా చూస్తూ వెళ్ళిపోయాడు. అయితే అదృష్టవశాత్తు అతన్ని మరో బ్రాంచిలో పోస్టు చేశారు. భారతి బతికిపోయింది.

తనకు ఇది చిన్నప్పటి నుంచీ అలవాటే. కాలేజీలో అమాయకంగా కనిపించే పిల్లలను ఏడిపించేది. అన్నింటికన్నా అన్యాయం ఒకసారి జరిగింది. తనకప్పుడు పదిహేనేళ్ళు ఉంటాయేమో. వీధి అరుగుమీద కూర్చుని వుంటే జట్కాబండి వీధిలో ఆపి 'సింగరాజు వారిల్లేది తల్లీ...' అని అడిగిందొకామె తల బయటికి పెట్టి. 'కొత్తగా యిల్లుకొన్నారు...' అని వివరంగా కూడా చెప్పింది.

"అదుగో... ఆ దూరంగా కనిపించే మేడ... కాని ఆయన నిన్న రాత్రి చచ్చిపోయారు. గుండెజబ్బు-" అన్నది భారతి.

ఆమె మతిపోయినట్టు చూసి అంతలో గుండెలు బాదుకుంటూ ఏడుపు ప్రారంభించింది. భారతి ఆ బండిని ఫాలో అయి వెళ్ళింది. దారి పొడుగునా ఆ వయసు మళ్ళినావిడ ఏడుస్తూనే వుంది. జట్కా దిగి పక్క తలుపు తోసుకుని లోపలికి శోకాలు పెడుతూ వెళ్ళింది ఆమె. భారతి గోడచాటున నక్కి నిలుచుంది. వరండాలో ఎదురైన అల్లుణ్ణి చూసి ఆమె కొయ్యబారిపోయింది. ఏడుపులు పెడబొబ్బలతో లోపలికి వస్తున్న అత్తగారిని చూసి ఆయన 'ఏమిటి... ఏమిటి...' అంటూ అరిగిపోయిన రికార్డులాగా కంగారుపడ్డాడు.

భారతి ఆవులించి 'నీపేరు... బావుంది అరవిందమణి... అన్నట్టు నీకు రాక్షసులెలా వుంటారో తెలుసా?' అని అడిగింది.

ఆ అమ్మాయి కళ్ళు పెద్దవి చేసి తల అడ్డంగా వూపుతూ 'తెలీదు' అన్నది.

"తెలీదూ..."

భారతి అనవసరంగా నిట్టూర్చింది. తల్లిదండ్రులకు తానొక్కతే కూతురు. తాను పుట్టిన వెంటనే తల్లి పోయింది. తండ్రి కొన్నేళ్ళపాటు మామూలుగానే ఉన్నాడు. ఇదుగో,

ఇటీవల అయిదారేళ్ళుగా చిత్త చాంచల్యం పట్టుకుంది. పసిపిల్లాడిలా ప్రవర్తిస్తాడు. తనకేమో ఈ చాకిరీ తప్పదు. పెళ్ళి ఇంతలో అయ్యేట్టులేదు. వేలకువేలు కట్నం కుమ్మరించాలి. అది జరిగేపనికాదు. తనజీతం కాస్త కంటికి ఆనేదైతే ఎవరన్నా ముందుకు వచ్చి వుందురేమో! కానీ తనది గొర్రెతోక జీతం... ఇక అందం... అదెందుకు? కొరుక్కుతింటామా? అనుకుంటారు.

భారతి మళ్ళీ 'వర్షం తగ్గిందేమో...' అన్నది.

ఆ పిల్ల మాట్లాడలేదు.

భారతికి 'ఊరికే ఇలా కూర్చోవడం బోర్... ఏదైనా చెయ్యాలి...' అనిపించింది.

ఉన్నట్టుండి 'నువ్వెప్పుడూ రాక్షసుడ్ని చూళ్ళేదా? లావుగా, ఎత్తుగా, నల్లగా... భయంకరంగా వుంటారు రాక్షసులు. ఇంతంత పొడుగు పళ్ళూ... ఇంత పొట్టా... మెళ్ళో ఎముకల దండలు...' అన్నది.

ఆ పిల్ల బిక్కు బిక్కుమంటూ 'కథల్లో సినిమాల్లో వుంటారు...' అన్నది.

"నీకు రాక్షసుణ్ణి చూడాలనివుందా?'

ఆ పిల్ల ఏమీ మాట్లాడలేదు.

"నీకు ఇప్పుడే చూపిస్తాను కావాలంటే... అయితే చూసి వెంటనే వెళ్ళిపోవాలి."

"ఇదిగో... ఈ గది లోపల ఉంటాడు. మూడు రోజుల క్రిందట అడవుల్లో దొరికితే పట్టుకొచ్చి కట్టి పడేశారు... ఏమీ చెయ్యడు... నీకేం భయంలేదు తొంగిచూసి పరుగెత్తుకొచ్చేసెయ్..."

ఆ పిల్ల భయపడుతుందనుకుంది భారతి. 'బాబోయ్ నేను చూడను' అని పారిపోతుందనుకుంది.

కాని ఆ పిల్ల కుర్చీ దిగింది. నెమ్మదిగా అడుగులు వేస్తూ వెళ్ళి ఎదురు గది ముందు ఆగి భారతి వంక చూసింది. తర్వాత తలుపు తోసుకుని లోపలికి వెళ్ళింది. తలుపు వెంటనే మూసుకుంది.

ఒకటి...రెండు...మూడు... క్షణాలు దొర్లిపోతున్నాయి.

భారతికి కంగారు పుట్టింది. కుర్చీలో నిప్పులున్నట్టుగా ఫీలవసాగింది. లోపల నుంచీ ఏమీ వినిపించడంలేదు. ఆయన ఆఫీసరుగా రాగానే చేయించిన మొదటి పని అది. రూమంతా సౌండ్ ప్రూఫ్ చేయించుకున్నాడు.

భారతి లేవబోయింది.

అంతలో ఆఫీసరు గది తలుపు తెరచుకొంది. పవిత్రన్ వస్తున్నాడు. ఆ పిల్ల ఆయన చంకలో ఉంది.

అతడు నేరుగా భారతి దగ్గరికే వచ్చాడు. ఆమె బల్లముందు ఆగి 'ఫోన్ వచ్చింది మనం వెళ్ళవచ్చు' అన్నాడు.

"పప్పా ఈమె ఎవరు" అన్నది పిల్ల.

"వారి పేరు భారతి... స్టెనో... నమస్తే చెప్పు" అన్నాడాయన.

"నమస్తే..." అన్నది అరవిందమణి.

"మా అమ్మాయి... ఏకైక పుత్రిక... అల్లరిపిల్ల... మా మిసెస్ కూడా వచ్చిందట. బైట బల్లమీద వెయిట్ చేస్తున్నది."

ఆయన మళ్ళీ "చాలా కథలు చెప్పినట్టున్నారే ఇంతసేపూ... రాక్షసులూ... వగైరా..." అన్నాడు నడుస్తూ.

భారతి కంగారుగా "అబ్బే...ఏం తోచక... ఏదో వాగాను" అన్నది.

పవిత్రన్ భార్య అక్కడే పచార్లు చేస్తున్నది. ఆయన ఆడవాళ్ళిద్దరికీ పరిచయాలు పూర్తిచేసి ముందుకు నడిచాడు. ఆమె భారతివంక అదోరకంగా చూస్తూ ముందుకు నడిచి అతని పక్కనే నడుస్తూ ఏదో అన్నది. ఆయన నవ్వాడు.

భారతి నీరసంగా నెమ్మదిగా అడుగులు వేస్తున్నది. అన్ని అంతస్థులూ నడిచి క్రిందకి వచ్చింది. ఎదురుగానే బస్సుస్టాపు. అక్కడికి వెళ్ళి నిలబడి 'వర్షం తగ్గి ఎంతసేపయిందో...' అన్నది పక్కావిడకు వినిపించేట్టుగా.

ఆమె మతి పోయినట్టుచూస్తూ 'వర్షమా? కలగన్నారా ఏమిటి?' అన్నది.

'వర్షం పడలేదూ?' అన్నది మళ్ళీ భారతి.

"చుక్కయినా పడలేదు... అయినా ఇప్పుడేం వర్షం?" అన్నదావిడ మళ్ళీ.

భారతి నీరసంగా ఇంటికి చేరుకుని ముందు గదిలో లైటు వేసింది.

ఎదురుగా బల్లమీద ఆమె తండ్రి ఇంకా అలా నిలబడే వున్నాడు.

ఆమెకు కన్నీళ్ళుబికి వచ్చాయి.

◆ ◆ ◆